సాక్షి
చిత్తూరు
సోమవారం । 29 । జనవరి । 2024



భక్తులతో బోయకొండ కిటకిట

బోయకొండ గంగమ్మ ఆలయానికి భక్తులు భారీగా తరలిరావడంతో ఆలయ ఆవరణ అంతా కిటకిటలాడింది. - 8లో



రంకెలేసిన కోడెగిత్తలు..

వెదురుకుప్పం మండలం దామరకుప్పంలో జల్లికట్టు దుమ్మురేపింది. కోడెగిత్తలు రంకెలేశా యి. యువత జోరు చూపారు. - 8లో



మహిళా పక్షపాతి సీఎం జగనన్న

సీఎం జగనన్న మహిళలకు వైఎస్సార్ ఆసరా నిధులు అందించి మహిళా పక్షపాతిగా నిలుస్తున్నారని ఎమ్మెల్సీ భరత్ అన్నారు. - 8లో

న్యూస్‌రీల్

నేటి నుంచి ప్రజాభిప్రాయ సేకరణ

చిత్తూరు కార్పొరేషన్: విద్యుత్ చార్జీల పెంపు ప్రతిపాదనపై సోమవారం నుంచి ఫిబ్రవరి 1 వరకు ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించనున్నట్లు ట్రాన్స్‌కో ఎస్‌ఈ కృష్ణారెడ్డి ఆదివారం చిత్తూరులో మీడియాకు తెలిపారు. విశాఖపట్నంలోని కార్పొరేట్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రజాభిప్రాయ సేకరణలో ఏపీఈఆర్సీ అధికారులు పాల్గొంటారన్నారు. తిరుపతి అర్బన్, తిరుపతి రూరల్ డివిజన్లకు సంబంధించి తిరుపతి ఎస్‌ఈ కార్యాలయం, చిత్తూరు అర్బన్, చిత్తూరు రూరల్ ఈఈ కార్యాలయాల పరంగా రూరల్ ఈఈ కార్యాలయం, పీలేరు, మదనపల్లె డివిజన్ల పరంగా మదనపల్లె కార్యాలయంలో, పుత్తూరు డివిజన్ కార్యాలయాల్లో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి ఈఈలు ఏర్పాట్లు పూర్తి చేశారన్నారు. ఉదయం 10.30 నుంచి సాయంత్రం 4.30 వరకు అభిప్రాయ సేకరణ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇంధన శాఖ, జెన్‌కో, ట్రాన్స్‌కో అధికారులు కార్యక్రమంలో పాల్గొంటారని వివరించారు.

నేడు పరీక్ష పే చర్చ

– డీఈఓ విజయేంద్రరావు వెల్లడి



మాట్లాడుతున్న డీఈఓ విజయేంద్రరావు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా పాఠశాలల్లో ప్రధాని నరేంద్ర మోదీ నిర్వహించే పరీక్ష పే చర్చ కార్యక్రమానికి పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు డీఈఓ విజయేంద్రరావు వెల్లడించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో పరీక్ష పే చర్చా కార్యక్రమాన్ని విద్యార్థులు వీక్షించేలా చర్యలు చేపట్టినట్లు చెప్పారు. సోమవారం ఉదయం 11 గంటలకు పరీక్ష పే చర్చ కార్యక్రమంలో ప్రధాని నరేంద్రమోదీ విద్యార్థులతో పాటు టీచర్లు, తల్లిదండ్రులను ఉద్దేశించి వర్చువల్‌లో మాట్లాడుతారని, అలాగే వారు అడిగే ప్రశ్నలకు సమాధానాలు ఇస్తారన్నారు. ఈ కార్యక్రమం దూరదర్శన్‌తో పాటు ఇతర ప్రముఖ చానల్స్, రేడియో, యూట్యూబ్ ద్వారా ప్రత్యక్ష ప్రసారాన్ని తిలకించేందుకు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. డీడీ నేషనల్, డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.మైజీవోవీ.ఇన్ యూట్యూబ్ చానల్‌లో ఈ కార్యక్రమాన్ని తిలకించవచ్చన్నారు. జిల్లాలోని ప్రతి ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విధిగా కార్యక్రమం తిలకించాలని డీఈఓ ఆదేశించారు.

నేడు కలెక్టరేట్‌లో స్పందన

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 29వ తేదీన కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలను వినతుల రూపంలో అందజేసి పరిష్కరించుకోవాలన్నారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు స్పందన కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. అన్నిశాఖల జిల్లా అధికారులు స్పందన కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. గైర్హాజరైతే శాఖాపరంగా కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు.

నేడు పోలీసు కార్యాలయంలో..

చిత్తూరు అర్బన్: నగరంలోని పోలీసు కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎస్పీ వై.రిశాంత్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. చిత్తూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పక్కన ఉన్న ఆర్మ్‌డు రిజర్వు (ఏఆర్) కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే ప్రజలు నేరుగా తనను కలిసి మాట్లాడొచ్చని పేర్కొన్నారు.

వర్క్ ఆర్డర్లు క్లోజ్ చేయండి



మాట్లాడుతున్న ఫైనాన్స్ డైరెక్టర్ బాబు

చిత్తూరు కార్పొరేషన్: డివిజన్ల పరిధిలో పెండింగ్ వర్క్ ఆర్డర్లను క్లోజ్ చేయాలని ట్రాన్స్‌కో డిస్కం ఫైనాన్స్ డైరెక్టర్ బాబు తెలిపారు. ఆదివారం ఆయన చిత్తూరు అర్బన్ ఈఈ కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఫిబ్రవరిలోపు ఏఈలు వర్క్‌ఆర్డర్లు క్లోజ్ చేయకపోతే వారి జీతాల నుంచి ఆ మొత్తాన్ని కట్ చేస్తామని హెచ్చరించారు. పలుమార్లు ఈ విషయంపై చెబుతున్నా, ఏఈల్లో ఏ మార్పు లేదన్నారు. ఇక హెచ్చరికలు ఉండవనే విషయం గుర్తు పెట్టుకోవాలన్నారు. అదేవిధంగా ప్రైవేటు సర్వీసులు మూడు నెలలు బిల్లు కట్టకపోతే విద్యుత్ సరఫరా ఆపివేయాలని సూచించారు. చిత్తూరు అర్బన్, రూరల్ డివిజన్ల పరిధిలో మొత్తం 300 సర్వీసుల వరకు బిల్లులు కట్టని ప్రైవేటు సర్వీసుదారులకు నోటీసులు ఇవ్వాలన్నారు. అయిన వారిలో మార్పు రాకపోతే విద్యుత్ సరఫరాను తొలగించాలని ఆదేశించారు. తిరిగి పూర్తి పైకం చెల్లించాక సరఫరా ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఈఈలు హరి, పద్మనాభపిళ్లై, డీఈలు శేషాద్రి, ఏఏఓ గీత, జేఏఓ గోవిందరాజులు, ఏఈ, సబ్‌ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

జన చైతన్యయాత్ర



ర్యాలీగా వస్తున్న ఎంపీ విజయసాయిరెడ్డి, మేరిగ మురళీధర్, ఇతర నేతలు



సాధికార యాత్ర సభకు హాజరైన అశేష ప్రజానీకంలో ఓ భాగం

నేతల ప్రసంగాలకు స్పందన

ప్రజలతో మమేకం కావాలి.. ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో వివరించాలి.. సంక్షేమ ఫలాల లబ్ధిని తెలియజేయాలి.. రాబోయే ఎన్నికల సంగ్రామంలో జనం సరైన మార్గంలో పయనించేలా దిశానిర్దేశం చేయాలి.. సుపరిపాలనకు అండగా నిలిచేలా చైతన్య పరచాలి.. ఇదే లక్ష్యంతో వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సు యాత్రకు శ్రీకారం చుట్టింది. ఈ మేరకు ఆదివారం గూడూరు నియోజకవర్గం కోటలో నిర్వహించిన భారీ బహిరంగ సభకు ప్రజానీకం పోటెత్తింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దార్శనికతకు జైకొట్టింది.

- కోటలో వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సు యాత్ర
- 20 కిలోమీటర్ల మేర భారీ ర్యాలీ
- సంక్షేమ పాలనకు జైకొట్టిన ప్రజలు
- నేతలకు అపూర్వ స్వాగతం

చిల్లకూరు: గూడూరు నియోజకవర్గంలోని కోటలో ఆదివారం సామాజిక సాధికార బస్సు యాత్ర నిర్వహించారు. ఈ మేరకు చిల్లకూరు మండలం బూదనం నుంచి వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ విజయసాయిరెడ్డి, డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ తదితరులు ర్యాలీగా బయలుదేరారు. సుమారు 20 కిలోమీటర్ల కొనసాగిన ర్యాలీకి కోట పట్టణంలోని గోపాల్‌రెడ్డి విగ్రహం వద్ద భారీ ఎత్తున స్వాగతం లభించింది. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పేర్నాటి శ్యాంప్రసాద్ రెడ్డి గజమాలతో సత్కరించారు. స్థానిక వినాయక స్వామి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతంలో మైనార్టీ నాయకుల ఆధ్వర్యంలో దువా చేపట్టారు. ఈ క్రమంలో సభా ప్రాంగణానికి బయలుదేరిన నేతలకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. ముందుగా వేదికపై అంబేడ్కర్, అల్లూరి సీతారామరాజు, జ్యోతిరావ్ పూలే, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. విజయసాయిరెడ్డి మాట్లాడుతూ పేదల అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందిస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సామాజిక సాధికారత వెల్లివిరుస్తోందని వెల్లడించారు.



ప్లకార్డులతో మహిళలు, విద్యార్థుల ఆత్మీయ ఆహ్వానం



గజమాలతో స్వాగతం

నమ్మకాన్ని వమ్ము చేయను

వైఎస్సార్‌సీపీ గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త మేరిగ మురళీధర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయనని స్పష్టం చేశారు. డిప్యూటీ సీఎం నారాయణస్వామి మాట్లాడుతూ చంద్రబాబు ఔరంగ్‌జేబులా ప్రవర్తిస్తున్నారని, కుటుంబాలలో చిచ్చుపెడుతున్నారని విమర్శించారు. మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ మేలు జరిగి ఉంటేనే ఓటేయమని అడిగిన దమ్మున్న ముఖ్యమంత్రి జగనన్న అని కొనియాడారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్‌చక్రవర్తి, ఎమ్మెల్యేలు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, కిలివేటి సంజీవయ్య, నెల్లూరు మేయర్ స్రవంతి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్‌పర్సన్ పొనకా దేవసేనమ్మ, ఎన్‌డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నల్లపరెడ్డి వినోద్‌కుమార్‌రెడ్డి, సీఈసీ సభ్యులు ధనుంజయరెడ్డి, భక్తవత్సల్‌రెడ్డి, వీరిచలపతి, నల్లపరెడ్డి రజిత్‌కుమార్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్లు బొమ్మిడి శ్రీనివాసులు, మల్లు విజయకుమార్‌రెడ్డి, యద్దల మధుసూదన్‌రెడ్డి, నేదురుమల్లి ఉదయశేఖర్‌రెడ్డి, పలగాటి సంపత్‌కుమార్‌రెడ్డి, సన్నారెడ్డి శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

ప్రజల గుండెల్లో నిలిచేలా..

గూడూరు రూరల్: ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని డిప్యూటీ సీఎం నారాయణస్వామి తెలిపారు. సామాజిక సాధికార యాత్రలో భాగంగా ఆదివారం చిల్లకూరులో ఆయన విలేకర్లతో మాట్లాడారు. నా ఎస్సీ,నా ఎస్టీ, నా బీసీ, నా మైనారిటీ అంటూ అన్ని వర్గాలను అక్కున చేర్చుకున్న ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. రాజకీయ,ఆర్థిక సమానత్వం రావాలంటే చదువు ఎంతో ముఖ్యమని గుర్తించి విద్యారంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారని వెల్లడించారు. మాతృభాషకు ప్రాధాన్యం ఇస్తూనే ఇంగ్లిష్ మీడియాన్ని అమలు చేస్తున్నారని వివరించారు. ఎంపీ బీదమస్తాన్‌రావు మాట్లాడుతూ టీడీపీలో ఏనాడు ఎస్సీ,ఎస్టీ,బీసీలకు న్యాయం జరగలేదన్నారు.యాదవ సామాజిక వర్గానికి చెందిన తనను రాజ్యసభకు ఎంపిక చేసి సామాజిక సాధికారతకు జగనన్న నిలువెత్తు నిదర్శనంగా నిలిచారని కొనియాడారు. మైనారిటీ నేత ఖాదర్‌బాషా మాట్లాడుతూ వక్ఫ్ బోర్డుకు 500 ఎకరాలు అందించిన ముఖ్యమంత్రికి జీవితాంతం రుణపడి ఉంటామన్నారు. ఇమామ్‌కు రూ.5వేల గౌరవ వేతనం అందించడం ఎందరికో మేలు చేస్తోందని తెలిపారు.



ఉప్పొంగిన ఉత్సాహంతో పుష్పాభిషేకం



కదంతొక్కుతూ బైక్ ర్యాలీ



నృత్యాలతో సంబరం



మేరిగను పరిచయం చేస్తున్న విజయసాయిరెడ్డి

చరిత్ర సృష్టించేలా గృహాల నిర్మాణం

- రాష్ట్రంలోనే చిత్తూరు జిల్లా ఫస్ట్
- కుప్పంకు హంద్రీనీవా నీళ్లిచ్చి రైతులను ఆదుకున్నాం
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



పుంగనూరు: ఇళ్ల పట్టాలను పంపిణీ చేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి, జెడ్పీచైర్మన్ శ్రీనివాసులు, ఎంపీ రెడ్డెప్ప

పుంగనూరు: భారతదేశంలో ఏ రాష్ట్రంలోనూ చేపట్టని విధంగా గృహనిర్మాణాలు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టి ప్రథమస్థానంలో నిలిచి చరిత్ర సృష్టించామని, అదేవిధంగా రాష్ట్రంలో చిత్తూరు జిల్లా ప్రథమస్థానంలో నిలిచిందని రాష్ట్ర విద్యుత్, అటవీ, పర్యావరణ, గనులశాఖ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. ఆదివారం పుంగనూరు పట్టణంలో పేదలకు ఇళ్ల స్థలాలను చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, జెడ్పీచైర్మన్ శ్రీనివాసులుతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి పెద్దిరెడ్డి దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పారదర్శక పాలనను అందిస్తున్నారని కొనియాడారు. రాష్ట్రంలో 31 లక్షల మందికి ఇళ్ల పట్టాలు ఇవ్వడం జరిగిందని, అందులో రూ.22 లక్షల ఇళ్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. 16 లక్షల ఇళ్లు పూర్తి కాబోతున్నాయని తెలిపారు. నియోజకవర్గంలో 16 వేల ఇళ్లు మంజూరు చేయగా, 10 వేల ఇళ్లు పూర్తి అయ్యాయన్నారు. పట్టణంలో నాలుగు జగనన్న కాలనీలు ఏర్పాటు చేసి, 1,186 మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చామని, ప్రస్తుతం 426 మందికి పట్టాలు మంజూరు చేయడం జరిగిందన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వంలో కుప్పంలో కూడా ఇళ్లు నిర్మించలేదని, జన్మభూమి కమిటీల పేరుతో పేద ప్రజలకు మాయమాటలు చెప్పి మోసగించిన ఘనత చంద్రబాబుది అని ఆరోపించారు. కుప్పంకు హంద్రీనీవా కాలువ ద్వారా నీటిని విడుదల చేసి, ఆ ప్రాంత వాసులను ఆదుకోవడం జరిగిందన్నారు.

బాబుకు ఓటేస్తే అభివృద్ధికి విఘాతం..

14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పని చేసిన చంద్రబాబు కుప్పం అభివృద్ధిని పట్టించుకోలేదన్నారు. ప్రతిసారీ ఎన్నికల సమయంలో చంద్రబాబు మాయమాటలు చెప్పడం అలవాటుగా మారిందన్నారు. ప్రజలంతా గత ప్రభుత్వానికి, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పనితీరు, అభివృద్ధి, సంక్షేమంపై పరిశీలన చేసుకోవాలన్నారు. పొరపాటున చంద్రబాబు మాటలు నమ్మి, అతనికి ఓట్లు వేస్తే మన కాళ్లను మనం నరుక్కోవడమే కాకుండా అభివృద్ధికి విఘాతం కలిగించినవారవుతామని దుయ్యబట్టారు. కార్యక్రమంలో ఆర్డీఓ మనోజ్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, రాష్ట్ర జానపద కళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం , పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, బోయకొండ ఆలయ చైర్మన్ నాగరాజారెడ్డి, ఏఎంసీ చైర్మన్ అమరనాథరెడ్డి, నియోజకవర్గ పరిశీలకుడు జింకా వెంకటాచలపతి తదితరులు పాల్గొన్నారు.

మేనిఫెస్టోను అమలు చేసిన జగనన్న

ఎన్నికల పాదయాత్రలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను మేనిఫెస్టోలో పెట్టి, 99 శాతం అమలు చేశారని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు తెలిపారు. అర్హులైన పేదలందరికీ నవరత్నాలు, రూ.25 లక్షలకు ఆరోగ్యశ్రీ పరిమితి పెంచడం, జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు, 104ల ద్వారా వైద్యసేవలు అందించడం రాష్ట్రంలో చరిత్ర సృష్టించడమేనన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రతిఒక్కరూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని రెండోసారి ఏర్పాటు చేసుకునేందుకు కృషి చేయాలన్నారు.



పుంగనూరు: జరిగిన సమావేశానికి హాజరైన లబ్ధిదారులు



పుంగనూరు: దివంగత సీఎం వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి

వైఎస్సార్‌సీపీలోనే 'వన్నెకుల'కు గుర్తింపు



వన్నియకుల చిహ్నం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ సిపాయి, సంఘ నాయకులు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం

- వన్నెకుల క్షత్రియ చిహ్నం ఆవిష్కరణలో ఎమ్మెల్సీ సిపాయి

చిత్తూరు రూరల్: వన్నెకుల క్షత్రియులకు గుర్తింపు తెచ్చిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీనే అని ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం స్పష్టం చేశారు. చిత్తూరు నగరంలో ఆదివారం వన్నెకుల క్షత్రియ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ (వేద), కార్పొరేటర్ శశి ఆధ్వర్యంలో వన్నెకుల క్షత్రియ చిహ్నం అగ్నికలశం, జంబు మహర్షి వీర రుద్ర వన్నియర్ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వన్నెకుల క్షత్రియులకు తగిన గుర్తింపు లభించిందన్నారు. ఒకే జిల్లాలో ఇద్దరు వ్యక్తులకు ఎమ్మెల్సీ, ఒక డిప్యూటీ మేయర్ పదవిని కల్పించడం గొప్పవిషయమన్నారు. ఈ 70 ఏళ్ల కాలంలో ఇలా ఎప్పుడు జరగలేదని, తొలిసారి తమ కులానికి గుర్తింపు ఇచ్చిన ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందన్నారు. డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ అందరూ ఐకమత్యంతో కులాభివృద్ధికి పాటుపడదామని పిలుపునిచ్చారు. కార్పొరేటర్ శశి మాట్లాడుతూ వన్నెకుల విద్యార్థులకు విద్య, పేదలకు తోడ్పాటు అందించేలా వేద తరఫున కార్యక్రమాలు చేపడతామని వెల్లడించారు. కార్యక్రమంలో కులపెద్ద కాశీనాయకర్, నాయకులు సీఆర్ రాజన్, త్రిమూర్తి, జయకుమార్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిక



కుప్పం : వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్సీ భరత్, నాయకులు

కుప్పంరూరల్: కుప్పం మండలంలోని తాయప్పకొటాలు, బండెప్పకొటాలు ప్రాంతాలకు చెందిన 50 కుటుంబాలు ఆదివారం వైఎస్సార్‌సీపీలో చేరాయి. ఎమ్మెల్సీ భరత్, మండల కన్వీనర్ హెచ్‌ఎం మురుగేష్ ఆధ్వర్యంలో టీడీపీ నుంచి 50 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. ఎమ్మెల్సీ భరత్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో నాగరాజు, చంద్రన్, చాముండి, రమేష్‌తో పాటు 50 కుటుంబాలు ఉన్నాయి. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న అభివృద్ధిని, సంక్షేమ పథకాలు చూసి పార్టీలో చేరుతున్నట్లు చెప్పారు. 1వ తేదీ రాగానే ఉదయం 6 గంటలకే పింఛన్లు అందిస్తున్నామని తెలిపారు.

భక్తులతో కిటకిటలాడిన బోయకొండ


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

చౌడేపల్లి: పుణ్యక్షేత్రమైన శ్రీ బోయకొండ గంగమ్మ ఆలయం ఆదివారం కావడంతో భక్తుల రద్దీతో కిటకిటలాడింది. అమ్మవారి దర్శనం కోసం ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అర్చకులు అమ్మవారిని ప్రత్యేక పూలు, బంగారు ఆభరణాలతో అత్యంత సుందరంగా అలంకరించారు. కోరిన కోర్కెలు తీరిన భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు, జంతుబలులు ఇచ్చి మొక్కులు చెల్లించారు. ఆలయానికి భక్తుల తాకిడి పెరగడంతో క్యూలైన్లు నిండాయి. భక్తులకు అవసరమైన సౌకర్యాలను ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజారెడ్డి, ఆలయ ఈఓచంద్రమౌళి పర్యవేక్షించారు. భక్తులకు ఉచిత తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

నగరి : మండలంలోని నెత్తంకండ్రిగ గ్రామ చెరువు సమీపంలో పూర్తిగా కుళ్లిపోయి ఉన్న స్థితిలో ఉన్న గుర్తు తెలియని మృతదేహాన్ని ఆదివారం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. సీఐ సురేష్ తెలిపిన వివరాల మేరకు మృతుని వయస్సు సుమారు 60 ఏళ్లు ఉంటుందన్నారు. మృతి చెంది 10 రోజులకు పైన అయి ఉండవచ్చన్నారు. శవం పూర్తిగా కుళ్లిపోయి గుర్తుపట్టలేని స్థితిలో ఉండడంతో అక్కడే పోస్టుమార్టం నిర్వహించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళా పక్షపాతి సీఎం జగనన్న


కుప్పం: ఆసరా చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ భరత్


వి.కోట: సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ, నాయకులు

- నాలుగో విడతలో ఆసరా కింద కుప్పంలో రూ.26.01 కోట్ల పంపిణీ
- 35 ఏళ్లుగా కుప్పానికి చేసిందేమీ లేదు
- వచ్చే ఎన్నికల్లో కుప్పంలో వైఎస్సార్సీపీ గెలుపుజెండా ఎగురవేద్దాం
- ఆసరా నగదు పంపిణీ సభలో ఎమ్మెల్సీ భరత్

కుప్పంరూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి నాలుగేళ్లుగా ఆసరా నిధులు పంపిణీ చేస్తూ వారి కుటుంబాలు సుభిక్షంగా ఉండేలా చూస్తున్నారని చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ అన్నారు. కుప్పంలో ఆదివారం నాలుగో విడత ఆసరా పంపిణీ కార్యక్రమాన్ని కుప్పం పట్టణంలో మహిళా సభ్యుల సమావేశం చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ భరత్ మాట్లాడుతూ చంద్రబాబు ఎన్నడూ మహిళా అభ్యున్నతి కోరుకోలేదని, ఎన్నికల చివర్లో పసుపు కుంకుమ పేరిట మహిళలను మభ్యపెట్టేందుకు ప్రయత్నించారని అన్నారు. కానీ సీఎం జగనన్న ఇచ్చిన హామీ మేరకు మహిళలకు ఏటా వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా రుణమాఫీ నిధులను అందించి మహిళా పక్షపాతిగా నిలిచారన్నారు. కుప్పం మండల పరిధిలో ఉన్న 1230 గ్రూపులకు గానూ రూ.26.01 కోట్లు ఈరోజు పంపిణీ చేయడం జరుగుతోందన్నారు. ఇప్పటి వరకు నాలుగు విడతల్లో కలిపి మొత్తం రూ.104.05 కోట్లు సాయం అందించినట్లు చెప్పారు.

బీసీలను అన్యాయం చేస్తున్న బాబు..

చంద్రబాబు 35 ఏళ్లుగా బీసీలు 90 శాతం ఉన్న కుప్పం నియోజకవర్గంలో రాజకీయాలు చేస్తూ బీసీలకు అన్యాయం చేస్తున్నారని ఎమ్మెల్సీ భరత్ విమర్శించారు. ప్రస్తుతం కుప్పం టీడీపీ ఇన్చార్జ్గా ఉన్న ఎమ్మెల్సీ కంచెర్ల శ్రీకాంత్ కూడా అగ్రవర్ణాలకు చెందిన వ్యక్తి అని అన్నారు. 35 ఎమ్మెల్యే, 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా కుప్పంకు కనీసం శాశ్వత తాగు, సాగునీరు తేలేక పోయారన్నారు. కనీసం ఎన్నికల సమయంలో చెప్పుకోవడానికి ఒక్క పథకం లేక పోయిందన్నారు. తమ నాయకుడు వైఎస్ జగన్మోహన్రెడ్డి పాలనలో కుప్పానికి హంద్రీనీవా ద్వారా కృష్ణాజలాలు తీసుకొస్తున్నట్లు చెప్పుకొచ్చారు. అదే చంద్రబాబు దశాబ్దాలుగా ఇక్కడి నుంచి గెలుస్తున్నా కుప్పంలో ఇల్లు, ఓటు హక్కు లేదని గుర్తు చేశారు. కనీసం చంద్రబాబు ఫోన్ నంబరు కూడా కుప్పం జనం వద్ద లేదన్నారు. కానీ తాను, తన కుటుంబసభ్యులు మాత్రం అప్పటి నుంచి ఇప్పటి వరకు కుప్పం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ చేస్తున్నామని తెలిపారు.

కుప్పంలో గెలుపు జెండా ఎగురేద్దాం..

కుప్పం నియోజకవర్గం నుంచి ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్నా, ఏమాత్రం వివక్ష చూపకుండా అడిగిన వెంటనే అన్ని పథకాలు కేటాయించి కుప్పం జనం పాలిట దేవుళ్లుగా ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డి, మంత్రి రామచంద్రారెడ్డి నిలిచారని ఎంపీపీ అశ్విని, జెడ్పీటీసీ ఏడీఎస్ శరవణ, మండల కన్వీనర్ హెచ్ఎం మురుగేష్ అన్నారు. కుప్పం పోలీసు, రెవెన్యూ డివిజన్, కుప్పంను మున్సిపాలిటీ చేసి అభివృద్ధికి నిధులు కేటాయించారని కొనియాడారు. ఇంత మంచి చేస్తున్న ప్రభుత్వాన్ని మరోసారి గెలిపించుకుందామని, కుప్పంలో వైఎస్సార్సీపీ గెలుపు జెండా ఎగురవేసి సీఎం జగనన్నకు కానుకగా ఇద్దామన్నారు. అనంతరం ముఖ్యమంత్రి చిత్రపటానికి మహిళలు పాలాభిషేకం చేశారు. అనంతరం ఆసరా చెక్కును మహిళలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు వనిత, రంగయ్య, మునిరత్నం, తిమ్మరాయన్, షౌకత్, తిమ్మోజీగౌడు, నాయకులు పాల్గొన్నారు.


కుప్పం: సమావేశానికి హాజరైన మహిళలు

5 ఎకరాల భూమి కోసం కన్నకూతురి ఘాతుకం

- ఆస్తి కోసం కన్నతల్లిని నరికిన కుమార్తె


దాడిలో గాయపడిన తల్లి

రొంపిచెర్ల: మానవ సంబంధాలు మంటగలిసి పోతున్నాయి. ఆస్తుల కోసం, డబ్బుల కోసం పేగుబంధాన్ని తెంచుకుంటున్న సమాజం ఇది. తల్లీబిడ్డ బంధానికే మాయని మచ్చగా నిలిచేలా ఆస్తి కోసం కన్నతల్లినే కొడవలితో కూతురే దాడి చేసిన సంఘటన రొంపిచెర్ల మండలం బొమ్మయ్యగారిపల్లె పంచాయతీలో వెలుగు చూసింది. వివరాలు ఇలా ఉన్నాయి.. రెడ్డివారిపల్లెకు చెందిన ఎస్.లక్ష్మీదేవి (70)కి ఐదుగురు కుమార్తెలు. అందరికీ వివాహాలయ్యాయి. తనకున్న ఆస్తిలో అందరికీ పంచి ఐదు ఎకరాల భూమిని తన పేరిట పెట్టుకుంది. అయితే తల్లి పేరుతో ఉన్న ఆస్తి కాజేయాలని మూడో కుమార్తె కృష్ణవేణి ప్రయత్నం చేసింది. దీంతో తల్లి లక్ష్మీదేవి ఆర్డీఓ కోర్టులో కేసు వేసింది. అధికారులు భూ వివాదాన్ని పరిశీలించి ఆ భూమి తల్లి లక్ష్మీదేవికే చెందుతుందని నిర్ధారించారు. దీన్ని తట్టుకోలేని కుమార్తె ఆదివారం దుస్తులు ఉతకడానికి తన పెద్దకుమార్తె నాగరత్నమ్మతో బావి దగ్గరకు వెళ్తుతుండగా మూడో కుమార్తె కృష్ణవేణి కొడవలితో దాడి చేసింది. అలాగే అల్లుడు సుధాకర్ కట్టెతో అత్త లక్ష్మీదేవి, ఆమె పెద్దకుమార్తె నాగరత్నమ్మపై దాడి చేసి గాయపరిచాడు. స్థానికులు బాధితులను చికిత్స నిమిత్తం అన్నమయ్య జిల్లా, పీలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కృష్ణయ్య తెలిపారు.

చంద్రబాబు, పవన్ తోడుదొంగలు

- ఎర్ర డైరీ లోకేష్ ఆచూకీ లేదు
- రాజకీయ చదరంగంలో షర్మిల ఓ కీలుబొమ్మ
- డిప్యూటీ సీఎం నారాయణస్వామి


మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

పెనుమూరు(కార్వేటినగరం) : పేదల అభివృద్ధిని ఓర్వలేక చంద్రబాబు, పవన్కల్యాణ్ తోడు దొంగలుగా మారి సీఎం జగనన్న చేపడుతున్న అభివృద్ధిపై బురద చల్లేందుకు చూస్తున్నారని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. ఆదివారం పెనుమూరు మండలంలో వైఎస్సార్ ఆసరా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడారు. అధికారం ఉన్నంత కాలం జన్మభూమి కమిటీలతో కలసి నీరు–చెట్టు పథకం పేరుతో ప్రజాధనాన్ని చంద్రబాబు అండ్ కో నిలువునా దోచేశారన్నారు. సీఎం జగనన్న పేదలకు అందిస్తున్న సంక్షేమాల్లో అక్రమాలు జరిగాయని చంద్రబాబు కాకి లెక్కలు చెబితే అందుకు దత్తపుత్రుడు ఊగిసలాడి పోవడం చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని విమర్శించారు. వైఎస్సార్సీపీ మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారుల అంతు చూస్తానని ఎర్ర డైరీ చూపించే లోకేష్బాబు ఏమయ్యాడని ప్రశ్నించారు. మాట్లాడడం కూడా చేతకాని కొడుకును ముఖ్యమంత్రిని చేసుకోవడానికి చంద్రబాబు చేస్తున్న ఇక్కట్లను ప్రజలు చూడలేకపోతున్నారని అన్నారు. చంద్రబాబు, లోకేష్, దత్తపుత్రుడు పవన్ కల్యాణ్తో పాటు ఎల్లో మీడియా కలసి వచ్చినా సీఎం జగనన్నను ఏమీ చేయలేరన్నారు. రాజకీయ చదరంగంలో కీలుబొమ్మలా మారిన షర్మిలను అడ్డు పెట్టుకుని జగనన్నపైకి ఉసిగొల్పుతున్నారని విమర్శించారు. కానీలో 2024లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి మాత్రమేనని ఆయన జోస్యం చెప్పారు.

వెండి వస్తువుల వితరణ


వెండి వస్తువులను ఆలయ అధికారులకు బహూకరిస్తున్న డాక్టర్ రుఖియా బేగం

చౌడేపల్లి: సత్యప్రమాణాలకు నిలయమైన రాజనాలబండలో వెలసిన శ్రీ ప్రసన్నాంజనేయస్వామిని మహిళా కమిషన్ సభ్యురాలు డాక్టర్ రుఖియా బేగం కుటుంబసమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. ఆమె కుటుంబ సభ్యులు రియాజ్, డాక్టర్ రియా, గుణశేఖర్ కలిసి 150 గ్రాములబరువు కలిగిన సుమారు రూ.50 వేలు విలువ చేసే వెండి వస్తువులు స్వామివారికి విరాళమిచ్చారు. నగలను ఆలయ ఇన్స్పెక్టర్ పి.భానుప్రకాష్కు అందజేశారు. నగలను స్వామివారికి అలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు. పూజల అనంతరం పవిత్ర తీర్థప్రసాదాలను అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో గాజుల చంద్రశేఖర్, ఈశ్వరయ్య, మునిరాజ, రెడ్డెప్ప ఉన్నారు.

జిల్లాస్థాయి క్రికెట్కు పుత్తూరు జట్టు


విజేత జట్టుతో నిర్వాహకులు

నగరి : స్థానిక కేవీకే మైదానంలో ఆదివారం నిర్వహించిన ఆడుదాం ఆంధ్ర నియోజకవర్గస్థాయి క్రికెట్ ఫైనల్ మ్యాచ్లో పుత్తూరు మండలం కృష్ణసముద్రం జట్టు నగరి మండలం మాంగాడు జట్టుపై విజయం సాధించి జిల్లాస్థాయి క్రికెట్ పోటీలకు అర్హత సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన మాంగాడు జట్టు 48 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్కు దిగిన కృష్ణసముద్రం జట్టు 6 వికెట్ల తేడాతో లక్ష్యాన్ని ఛేదించింది. పోటీలను ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి సురేష్ పర్యవేక్షించారు. కేవీకే కోచ్ బాబు అంపైరింగ్ బాధ్యతలు నిర్వహించారు.

ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడిగా మదన్మోహన్రెడ్డి


నూతనంగా ఎన్నికైన ఎస్టీయూ జిల్లా కార్యవర్గం

చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) నూతన జిల్లా అధ్యక్షుడిగా మదన్మోహన్రెడ్డిని ఎన్నుకున్నారు. ఆ సంఘం నూతన కమిటీ ఎన్నికలు ఆదివారం స్థానిక డీఈఓ కార్యాలయం పక్కన ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ ఎన్నికలకు గురుకుమార్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. అనంతరం వెల్లడించిన వివరాల మేరకు ఆ సంఘం నూతన జిల్లా అధ్యక్షుడిగా మదన్మోహన్రెడ్డి (యాదమరి), ప్రధాన కార్యదర్శిగా బోడె మోహన్ (పుంగనూరు), ఆర్థిక కార్యదర్శిగా యువరాజు (కార్వేటినగరం), అసోసియేట్ అధ్యక్షులుగా రమణారెడ్డి, చిట్టిబాబు, చంద్రన్, సుబ్రహ్మణ్యం ఎన్నికయ్యారు. అదనపు ప్రధాన కార్యదర్శులుగా అమరనాథ్రెడ్డి, కిషోర్కుమార్రెడ్డి, చంగల్రాయల్, విజయలక్ష్మి, పవన్కుమార్, ఉపాధ్యక్షులుగా జ్యోతిశ్వరుడు, సుమతి, శ్రీనివాసులును ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి, సంఘం బలోపేతానికి తమవంతు కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులను పలువురు దుశ్శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు గంటా మోహన్, దేవరాజులురెడ్డి, పురుషోత్తం పాల్గొన్నారు.

597 సర్వీసులపై కేసుల నమోదు

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లాలో శనివారం సాయంత్రం నుంచి రాత్రి వరకు ట్రాన్స్కో 8 డివిజన్ల పరిధిలోని విద్యుత్ సర్వీసులను సిబ్బంది తనిఖీ చేశారు. ఇందులో మొత్తం 3,350 సర్వీసులను తనిఖీ చేయగా తిరుపతి ఆపరేషన్ 91, తిరుపతి రూరల్ 75, పుత్తూరు 79, చిత్తూరు అర్బన్ 100, చిత్తూరు రూరల్ 48, మదనపల్లె 73, పీలేరు 68, పుంగనూరు పరిధిలో 63 కేసులు బుక్ చేశారు. ఇందులో విద్యుత్ అదనపు లోడ్ కేసులు 492 కేసులకు గాను క్రమబద్ధీకరణ రుసుం రూ.12.12 లక్షలు, చౌర్యం కేసులు 105కు గాను రూ.90 వేలు జరిమానాతో కలిపి మొత్తం 597 సర్వీసులపై కేసులు నమోదు చేశామన్నారు. ఈ వినియోగదారులు రూ.13.02 లక్షలు చెల్లించాలని నోటీసులు ఇచ్చినట్లు ఎస్ఈ కృష్ణారెడ్డి వివరించారు.

నేడు కాణిపాకంలో సంకటహర చతుర్థి

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో సోమవారం సంకటహర చతుర్థి వ్రతం నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు. ప్రతి నెల పౌర్ణమి తరువాత నాలుగో రోజు ఆలయంలో సంకటహర చతుర్థి వ్రతం నిర్వహిస్తారు. ఈ పూజా కార్యక్రమాలు ఆలయంలో రెండు పర్యాయాలు జరుగుతాయి. ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 5 గంటల నుంచి 6 గంటల వరకు సంకటహర చతుర్థి వ్రతాన్ని ఆలయ వేద పండితులు నిర్వహిస్తారు. ఈ వ్రతంలో పాల్గొనే భక్తులు ఒక్కొక్కరు రూ.350 ఇచ్చి టికెట్ కొనుగోలు చేసిన పూజా సామగ్రిని దేవస్థానం వారే అందిస్తారని చైర్మన్, ఈఓ తెలిపారు. అలాగే సాయంత్రం 7 గంటలకు ఆలయ మాడ వీధుల్లో స్వామివారి స్వర్ణ రథం ఊరేగింపు ఉంటుందన్నారు.

8 నుంచి ఆరాధనా మహోత్సవాలు

తిరుమల: కర్ణాటక సంగీత పితామహుడు పురంధర దాసుల ఆరాధనా మహోత్సవాలు టీటీడీ దాససాహిత్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఫిబ్రవరి 8 నుంచి 10వ తేదీ వరకు తిరుమల ఆస్థాన మండపంలో ఘనంగా నిర్వహించనున్నారు. చివరిరోజు ఫిబ్రవరి 10న ఉదయం సుప్రభాతం, ధ్యానం, సామూహిక భజన, నగర సంకీర్తన, హరిదాస రసరంజని కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అలాగే ఫిబ్రవరి 7న తిరుమలలోని కల్యాణవేదికలో యువ కళాకారులతో 'శ్రీ వేంకటేశ్వర నవరత్న మాలిక' గోష్ఠిగానం నిర్వహించనున్నారు.

కళాకారులకు 'యువ ప్రతిభ పురస్కారాలు'

సంగీత, నృత్య, వాద్య రంగాలలో నిష్ణాతులైన యువ కళాకారులకు ఈ ఏడాది మొదటిసారిగా టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో ×యువ ప్రతిభ పురస్కారాలు' అందజేయనున్నారు. ఈ కార్యక్రమాల ఏర్పాట్లను టీటీడీ దాససాహిత్య ప్రాజెక్టు ప్రత్యేకాధికారి ఆనందతీర్థాచార్యులు పర్యవేక్షిస్తున్నారు.

రంకెలేసిన కోడెగిత్తలు.. యువత జోరు



వెదురుకుప్పం : దామరకుప్పంలో అల్లి వద్ద దూసుకుపోతున్న పశువులను నిలువరిస్తున్న యువత

వెదురుకుప్పం: కాలుదువ్విన కోడెగిత్తలు.. దూసుకుపోతున్న ఎడ్లను నిలువరించేందుకు యువత చూపిన తెగువ.. ఎద్ల పందేలను వీక్షించేందుకు విచ్చేసిన జనం అరుపులు కేకలతో మండలంలోని దామరకుప్పంలో జరిగిన జల్లికట్టు దుమ్మురేపింది. సంక్రాంతి సంబరాలలో భాగంగా గ్రామంలో యువత ఆధ్వర్యంలో ఎద్ల పందేలు నిర్వహించారు. ముందుగా ఎద్లకు పలకలు, వస్త్రాలు, బెలూన్లు కట్టి పందేనికి సిద్ధం చేశారు. అంతకుముందే వివిధ ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో యువత అక్కడికి చేరుకుని పలకల కోసం అల్లి వద్ద సిద్ధంగా నిలబడగా, నిర్వాహకులు ఎద్లను ఉసిగొల్పారు. దీంతో రంకెలేస్తూ దూసుకుపోతున్న ఎద్లను యువత కట్టడి చేసేందుకు ప్రయత్నించారు. ఎద్ల వేగాన్ని నిలువరించలేక పలుమార్లు చేతులెత్తేశారు. మరికొందరు అయితే ఉత్సాహంతో పరుగులు తీస్తున్న కోడెగిత్తలను కట్టడి చేసి పలకలను లాక్కొన్నారు. అనంతరం వారు విజయ దరహాసంతో చిందులు వేశారు. ఈ ఎద్ల పందేలను వీక్షించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన వారితో గ్రామం జనంతో కిక్కిరిసింది.